ఒకమాటు పూలు చూస్తూను, ఒక మాటు కఱ్ఱ చూస్తూను ఆ యువతి ఏమని జవాబు చెప్పుచున్నది ? " అడివిని చెరిపిన చెట్టు, అడివిని పూచిన పువ్వు. అర్ణవమునకు పోయి అవి అంద వుగా నీకు ! వచ్చేసెయ్యి ! ఇంకో పువ్వు, ఇంకో చెట్టాపించేన్! వచ్చేయి ! వచ్చేయి !" ఆలా ఆమె అంటూనే వుంది. వాడు అక్కడ సుడిగుండంలో పడి మరణించాడు. ఆ పిల్ల తల్లో మఱి పువ్వు లేదు. ఆ పిల్ల మఱి డొంకెన పట్టలేదు.

.... .... .... .... ....

# సన్యాసి - పేదగేస్తుడు

ఆ దారిని షికారు పొయ్యేవాళ్ళు చూచే
యుంటారు వాళ్ళనూ ఆ పాకనూ.

ఆ పాక వాళ్ళ హక్కు భుక్తంలోకి ఎలా వచ్చిందో ఆ సంగతి చారిత్రక పరిశోధకులకు విడిచిపెట్టవలసినదే. లేదా ! రైల్వేవారుగాని, డి. పి. డబ్ల్యు వారు గాని, మునిసిపాలిటీవారు గాని, దావాచేస్తే ఆ దావాలో వెల్లడికావలసిందే. అంతవఱకు అదివొక చిదంబర రహస్యంగా పరిగణింపవలసివుంటుంది. ఇంత మంది నెందుకు పేర్కొవలసివచ్చింది ? అడుగుతారేమో— ఆ పాకకు తూర్పు పక్కనుంచే రైలుపట్టాలమలుపు, పడమటి పక్కనుంచే ఏటిగట్టు కలుపు, మఱి మునిసిపాల్టీ సరిహద్దుల్లో దాని నిలుపు. వీళ్లల్లో ఎవరు తమ దిగాదాన్ని ఉత్తరోత్తరా దావాచేసి రాబట్టుకుంటారో ఊహాతీతం, బహుశా ఎవళ్లూ ఆ పాకజోలికి పోరనుకుంటాను. ఏమా-ఎవరికీ అది అడ్డున్న ట్టుగా తోచదు. కానైతే కోసుగా ఎత్తుగా లేచిన ఇలారపాక.

"ఈ పాక యిక్కడెవరు వేశార్రా ?" అని అందులో వున్న వాళ్ళను అడిగితే వాళ్లు తమకు తెలియదనే రకంగాళ్లు. నిజంగా తెలియకపోవచ్చును కూడాను. ఎంచేత అంటే ఆ పాక వాళ్ళు వేసికున్నది కాదంట. ఎవళ్లో వేసికున్నదంట. ఇక మఱి వాళ్ళను అడిగి ప్రయోజనమేమిటి ? దాన్ని ఎవళ్లో మాత్రం వేసివుండాలి. కాకపోతే వెదురూ తాటాకూ పైనుంచి వర్షంగా కురవ్వుకదా !

అమావాస్య రాత్రి ఆ పాక ఆనవాలుగా తెలియదు. ఏ పెనుభూతంలాగో, పెద్ద కాటుకముద్దలాగో వుంటుంది. అందులో దీపంవుండదు. పాకలో వున్నవాళ్ళు మనుష్యులని కూడా మనం అనుకోము. వాళ్లకు ఒంటినిండా గుడ్డకు కరువు. కంటినిండా కూనుక్కుకు కరువు. కడుపునిండా తిండికి కరువు. మిక్కిలి బీదవాళ్లు. సంఘమనేది ఇకంతకంటె అధమాధమ పరిస్థితిలో వుంది అని నేను యనుకోను. కాని వాళ్ళదొక సంసారం, మొగుడూ పెళ్ళాం కొంతమంది పిల్లలూ—అంతా పేదరికమే మూర్తీభవించి కనబడుతుంది. ఆ సంసారాన్ని చూచినప్పుడు నా కొకటి తోస్తుంది. కొందఱు నెలకు వెయ్యో రెండువేలూ ఇలాగ్గా తెచ్చుకొంటూ వుంటారు. కొందరి కొందరికి సాలుకిరవై వేలు ఆదాయంవస్తుంది. ఆలాగ్గాకాకుండగా ఈ కుటుంబానికి నెలకు వంద, కాకపోతే పాతిక, ఆఖరుకు పదిఅన్నా వచ్చే కుటుంబం కాకపోవునేమో అని తలపోసి అప్పుడది మరలొచ్చు బ్రతికిచెడ్డ కుటుంబం అయి అప్పుపడ్డ కుటుంబం అయిపోతుందే? అప్పుపడ్డ సోమార్లయిపోతారా, స్వతంత్రంగా గడించుకొని ఎంతోకొంత దానిగంజి త్రాగినా పరమాన్నమేమో ? ఇలాగ్గా

మళ్ళీ జిజ్ఞాసలోకి వస్తుందిగా మనస్సు. ఏదన్నా లోకంలోని ఆర్థికసమస్య పరిష్కరించడమనేది బహుప్రయాస. అదివొక త్రాటిమీద నడచేది కాదు.

కాబట్టి ఎవడైనా ఒకడు తెలివైనవాడు ఆ కుటుంబం యొక్క సహజ ప్రతిభను గుర్తించి వాళ్ళకనువైన జీవనోపాధి కల్పించి ఆ కుటుంబంయొక్క స్వయం వ్యక్తిత్వాన్ని ఆత్మ గౌరవాన్ని నిలబెట్టినవాడైతే వాడు బహూ పుణ్యాత్ముడు. అటువంటి పుణ్యాత్ము డెవడైనా వున్నాడా?

లేకపోవడమేం? దగ్గఱగానే ఒకసన్యాసి వున్నాడు. వాని పని అస్తమానం ఆ బీద కుటుంబాన్ని గురించి ఆలోచించడమే.

సన్యాసులకు యోగశక్తి మిక్కుటం అంటారు. మరిన్ని మంత్ర సత్తాకూడా కద్దంటారు. మన సన్యాసి ఓరోజు రాత్రి యిక ఆ బీద కుటుంబాన్ని యమాంతంగా భాగ్యవంతం గావిద్దామని వూహించి, యట్టే ఆ బీదవాళ్ళకు తెలియకుండా ఒక పుల్లతో ఆగుడిసెనంతనూ మంత్రించి వైచినాడు. ఆ మంత్ర ప్రభావం ఎటువంటిదీ యంటే—గుడిసె అలాగ్గానే యుండిపోయింది. కాని గుడిసెలో వాళ్లు ఱెక్కలొచ్చి ఎగిరిపోయినట్లు ఎగిరిపోయి, ఓపెద్ద మహాభవనంలో, పట్నానికీ గుడిసె దక్షిణ దిక్కునుంటే పట్నాని వుత్తరపు దిక్కున వాలిపోయేరు. అంతా వాలేరు. మొగుడూ పెళ్ళాం, పిల్లలూ యావన్మందీని.

అటువంటి యోగశక్తి యీ కాలంలో యుంటుందా యని యనుకోకండి. ఉంటుంది? అదో డెర్బీస్వీప్‌వంటి యోగశక్తి యని యనుకుంటే ప్రత్యక్ష ప్రమాణంగా కనిపిస్తుందికూడాను.

బీదగేస్తుడు తానో పట్టరాని కుబేరుడై పోయినాడు. వాని యిల్లాలో మహాలక్ష్మిలాగు వెలిసి పోయింది. పిల్లల మాట

మఱి చెప్పక్కర్లేదు. ఒకడు బంగారు గొలుసుల ఉయ్యాల్లో ఊగుతూవుంటే ఒకడు ముత్యాల జాలరు వోసిన పందిరిపట్టి మంచంమీద దొర్లుతూ యున్నాడు. అటువంటి వైభోగ మహా యోగం యోగించిన వానిచుట్టూ పరివార జనాని కేంలోటు? మాంచి ఇదిగా దాస దాసీజనం యమేషా రాత్రింబవళ్ళు వాళ్ళకు సేవ చేస్తూవుండేవారు. వాళ్ళూ వీళ్ళూ యందఱూకూడా యస్త మానం షర్బత్తులు తాగుతూ బల్‌కుషీగా ఉండేవారు.

సన్యాసి కేతత్సంపన్నుని ఒకమారు చూడాలని బుద్ధిపుట్టి సంపన్నుని గుమ్మం మెట్టు ఎక్కినాడు. సంపన్నుడును సన్యాసికి మొక్కి "ఏం కావా" లన్నాడు. "నీ సిరీ సంపత్తూ చూచి పోవచ్చాను" అన్నాడు సన్యాసి. "రాండి" అని ఆ సన్యాసికి తనయొక్క అష్టయిశ్వర్యములూ చూపించినవాడై తన మహా భవనంయొక్క ఏడో యంతస్థుమీది యుపరిభాగానికి తీసుకు వెళ్ళి, దిగంతాలు చూడమన్నాడు. కోటి సూర్యప్రభల్లా ఎటు చూచినా విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి!

సన్యాసి యడిగేడు "ఓయీ! నీకు మనస్సులో ఏ విధ మైన ఆలోచనా లేకుండా నిశ్చింతగా ఉన్నావుకదా!" అని. "నాకు చింతలులేవు గాని స్వామీ! ఇన్ని విద్యుత్కాంతులకూ అవల ఆ దూరంగా రోజూ వొకటి రెండు మంటలు కనిపిస్తూ ఉంటాయి. ఏదో బాజాల చప్పుడు విచారకరంగా వినబడుతూ ఉంటుంది. ఆ వెఱ్ఱి వెలుగు భూమ్మీద లేకుండా చేద్దురూ! ఆ బాజాలమీదనుంచి గాలి యీతట్టుకు రాకుండా చూద్దురూ మీకు చేతనైతే" అన్నాడు మహాభోగి.

"ఓయి పిచ్చివాడా!" అన్నాడు సన్యాసి—"మరచి పోయినట్టున్నావు" అన్నాడు. "నీవో చిన్న ఇలారప్పాకలో

ఊరిచివర ఉండే రోజులు జ్ఞప్తికి తెచ్చుకో" అన్నాడు సన్యాసి. మహాభోగికి హృదయం విదారితం గాజొచ్చింది. సన్యాసి ఇంకా చెబుతున్నాడు. "ఇలాంరపాకకు యసుకుంటా యనతి దూరంలో శ్మశానం ఉండేది. ఆ శ్మశానంలో కాష్టం తగలడుతూ ఉంటే ఆ మంటనుండి తాటాకు యంటించుకుని నీ పాకలో పచనం కోసంగాను ఓరాత్రి యగ్నిహోత్రాన్ని ఉపయోగించుకున్నావు నీవు. జ్ఞాపకం వచ్చిందా?" అని అడిగేడు సన్యాసి. "మరిన్నీ శ్మశానంలో మోగే బాజాలకు నీ పిల్లల్ని తప్పెట్లు చఱవమంటూ నీవూ వాళ్ళూ కలిసి ఆనందించిన రోజులెన్ని వున్నాయో జ్ఞాపకం చేసుకో" అన్నాడు సన్యాసి.

సంపన్నునకు మతిపోయి నట్టయింది — "నిజమే స్వామీ" అన్నాడు, ఆ రాత్రి అగ్గి పుడక్కి-కూడా దిక్కు-లేక పోయినవాణ్ణయి మరెక్క-డినుంచీ పొయ్యి రాజడానికి నిప్పు కనబడక ఆ నికృష్టపు కార్యాని కొడిగట్టాను. మరి యప్పట్లో నా పిల్లలకు ఆటవస్తువులా! తోపుడుబళ్ళా? బ్యాండు వాయిద్యాలా! ఏమున్నయి చెప్పండి స్వామీ! మీకేలా తెలిసింది యీ యుదంత మంతాను?" అని ఆ సన్యాసి కాళ్ళమీద పడి వెక్కి- వెక్కి- ఏడ్చినాడు ఆ సంపన్నుడు.

"ఎందుకేడుస్తావు? ఆ పాకకు యవతల ఉండేవాణ్ణి నేను. నేను నీ బీదతనం చూచి జాలిపడి నా మాయా ప్రభావం చేత నీకీ మహావైభవం కల్పించాను" అన్నాడు సన్యాసి.

"అయితే వెర్రి వెలుగు చూపించడ మెందుకు? ఆ బాజాలు వినబడజేయడ మెందుకు ఇంకాను" అన్నాడు గేస్తుడు.

"అదీ పోంగొట్టుకోవాలి అని నిజంగా వుందా నీకు ?" అన్నాడు సన్యాసి.

"ఉంది" అన్నాడు గేస్తుడు. "ఇదిగో చూడు" అని సన్యాసి ఆ గేస్తుని కళ్ళు తన కమండలంలోని నీళ్ళతో తుడిచేడు గేస్తుడు అప్పుడు మరో వెలుగు చూస్తూ మరో రొద విన్నాడు.

ఏమిటది యని లోకం అడగొచ్చు. ఆ వెలుగు లోకాన్ని దహించే ఆకలిచిచ్చుది. ఆ రొద నిజమైన పేదవాళ్ళయొక్క "మధూకరమమ్మా !" అనే అర్పు.

తొల్లింటికంటె ఎక్కువగా చలించి పోయినాడు సంపన్నుడు. "ఈ మాయభోగం నాకు వద్దు. వాళ్ళకిచ్చివేయ" మన్నాడు. ఆ మాట అతని నోటివెంబడి వచ్చినట్టుగా సన్యాసి తిరోహితుడైనాడు. ఏతద్గృహస్థు యొక్క భాగ్యభోగాలను మాయ నశించింది.

.... .... .... .... ....

# సాను భూతి

"రిక్షా" అనగా రెండుచక్రాలబండి;
చక్రాలనగా వాటంతట అవి దొర్లవు,
లాగాలి, లాగాలి అనగా ఎడ్లూ, గుర్రాలూ లాగవు, మనుష్యులే లాగుతారు. పూర్వం అది చెన్నపట్నంలోనే తఱచు కనిపించేది; ఇప్పుడు రాజమ్మహేంద్రవరం, కాకినాడ, ఇత్యాది నగరాల్లో కూడా పరిపాటిగా మనదృష్టిని పడుతూవుంది. చాలామంది యీపాటికి దాన్ని చూచేవుంటారు.

లాగేవాడు కటిక నేలను కాళ్ళ పరుగెత్తుతూవున్నా, కూర్చునేవాడు కాళ్లు సాచుకు మెత్తమీద సుఖంగానే